క్లుప్తంగా

పారదర్శకంగా పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాల గురించి వివరిస్తున్న ఏఓ, ఏఎస్ఓ

బత్తలపల్లి: ఖరీఫ్ పంట కోత ప్రయోగాలు పారదర్శకంగా చేపట్టాలని గ్రామ వ్యవసాయ అధికారులకు ఏఎస్ఓ డాక్టర్ కేవీఎస్ లక్ష్మీనరసింహాశర్మ, ఏఓ ఓబిరెడ్డి ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏఓ అధ్యక్షతన ఉచిత పంటల బీమా పథకం, పంట కోత ప్రయోగాలపై వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏ, ఎంపీఈఓలకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత పంటల బీమా కింద ఎంపికైన కంది, ఆముదం, వరి పంటకోత ప్రయోగాలు నిర్వహించే విధానం గురించి వివరించారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం రైతులకు సబ్సిడీ విత్తనాలను బుధవారం తాడిమర్రిలోని రైతు సేవా కేంద్రంలో ఏఓ రమాదేవి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 80 శాతం సబ్సిడీతో ఉలవలు, జొన్నలు, పెసలు, అలసందలు తదితర విత్తనాలు అందజేశారు. అలాగే విత్తనం వేసిన ప్రతి రైతూ తాము సాగు చేసిన పంటలను 15వ తేదీలోపు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్‌కుమార్, వీహెచ్ఏ గౌతమి, టీడీపీ మండల కన్వీనర్ రామ్మోహన్, బీజేపీ నాయకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

ముదిగుబ్బ: మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ-2 రమణప్ప తెలిపారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో మండల కోఆర్డినేటర్ రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.రేఖ, శాంతలింగం, రజనీకాంత్, శిల్ప, జ్యోతియాదవ్ తదితరులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ-2 మాట్లాడుతు బాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లో బాలుర, బాలికల అండర్-14, అండర్ -17 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని విద్యార్థులు ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

స్కూల్ గేమ్స్‌లో పాల్గొనండి

బత్తలపల్లి: రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ వెంకటనాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అండర్-14, అండర్- 17 బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, చెస్, యోగా తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో పీడీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయండి

ఎన్‌పీకుంట: మండలంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మనోహర్‌బాబు అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని పశువుల మంద వద్ద నిర్మాణం ఆగిపోయిన పంచాయతీ భవనాన్ని బుధవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.

సంత నిర్వహణకు స్థల పరిశీలన: ఎన్‌పీకుంటలో సంత నిర్వహణ కోసం అనువైన ప్రభుత్వ స్థలాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మనోహర్ పరిశీలించారు. పశువుల మంద వద్ద ఉన్న ప్రభుత్వ స్థలం సంత నిర్వహణకు అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ముబారక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తేజకళ పాల్గొన్నారు.

'భూ సమస్య పరిష్కరించండి'

కనగానపల్లి: మండలంలోని తూంచర్ల గ్రామ పరిధిలో ఉన్న భూ సమస్యకు పరిష్కారం చూపాలని రైతు బి.రామచంద్ర రెవెన్యూ అధికారులను కోరుతున్నాడు. బుధవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ.. తూంచర్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 179-3లో 8.41 ఎకరాల భూమి ఉందని తెలిపాడు. అందులో తన పేరు మీద 4.21 ఎకరాలకు రిజిస్ట్రేషన్ పట్టా ఉందని పేర్కొన్నాడు. మిగిలిన విస్తీర్ణం అన్న బి. రామలింగప్ప పేరుపై ఉందని తెలిపాడు. అయితే అన్న కుమారుడైన చంద్రశేఖర్ తండ్రి భాగంతో పాటు నా పేరిట ఉన్న భూమిని కూడా అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరాడు.



పుట్టపర్తి సమీపంలో శోభాయాత్ర





ధర్మవరం పట్టణంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు

గణపతి బప్పా మోరియా!

- కోలాహలంగా వినాయక నిమజ్జనం



ఎన్‌పీకుంటలో ఉట్టి కొట్టడానికి పోటీ పడుతున్న యువకులు



ఎన్‌పీకుంటలో నిమజ్జనానికి గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

పుట్టపర్తి అర్బన్/ధర్మవరం అర్బన్/ తలుపుల/ నల్లమాడ/ ముదిగుబ్బ: గణేశ్ ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఊరూవాడా కొలువుదీరిన వినాయక విగ్రహాలను ఐదు రోజుల పూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. శోభాయాత్ర కోలాహలంగా సాగింది. పుట్టపర్తి మండలం పెడపల్లి, నిడిమామిడి, కొట్లపల్లి, వెంగళమ్మచెరువు తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలను చెరువులు, చిత్రావతి నదిలో నిమజ్జనం చేశారు.

- ధర్మవరం పట్టణ పురవీధుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రేన్‌ల సాయంతో చెరువులో నిమజ్జనం చేశారు. యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ డ్యాన్సులు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. ధర్మవరం చెరువుతోపాటు కుణుతూరు వంక, గొళ్లపల్లి వంకలలోనూ విగ్రహాలను నిమజ్జనం చేశారు.
- తలుపుల మండల కేంద్రంలోని ఎగువపేట, బలిజపేట, తూపల్లి గ్రామాల్లో గణేశ్ నిమజ్జనం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. బాణసంచ కాల్చుతూ, డ్రమ్స్ వాయిస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. తూపల్లి నిమజ్జన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫినాయక్ తదితరులు పాల్గొన్నారు.
- నల్లమాడ మండల కేంద్రంలో బుధవారం వినాయకుడి ఊరేగింపు, నిమజ్జనం కోలాహలంగా సాగాయి. చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకొంటూ డీజే పాటలకు ఉల్లాసంగా చిందులు చేశారు. కీలు గుర్రాల వేషధారణలో ఎస్సీ కాలనీవాసులు ఆకట్టుకున్నారు. సమీపంలో పాతరకుంటలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.
- ఎన్‌పీకుంటలోని అంబేడ్కర్‌నగర్ కాలనీతో పాటు పీర్లచావిడి వద్ద ఓంకార గణపతి మిత్ర మండలి వారు ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన మహోత్సవం బుధవారం కోలాహలంగా సాగింది. పీర్లచావిడి వద్ద ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మండెంవారిపల్లి యువత ఉట్టి కొట్టి రూ.10,116 నగదు బహుమతి గెలుచుకున్నారు. ఈ మొత్తాన్ని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు బాబ్జాన్, విగ్రహదాత డాక్టర్ నరసింహారెడ్డి చేతుల మీదుగా అందించారు. అనంతరం గణపయ్యను ట్రాక్టర్ లో మండల కేంద్రంలోని పుర వీధుల గుండా డప్పు, వాయిద్యాలతో బాణసంచా పేల్చుతూ, రంగులు చల్లుకుంటూ, కోలాటాలాడుతూ యువకులు, మహిళలు సందడి చేశారు. గ్రామ పరిసర ప్రాంతంలోని చెరువులో గణనాథుని నిమజ్జనానికి తీసుకెళ్లారు. పీర్లచావిడి వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూ వేలం పాటలో రూ.1,05,116 పలికింది. పాలగిరి మౌలాసాబ్ ఈ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.
- ముదిగుబ్బ మండలంలో బుధవారం గణేష్ నిమజ్జనం వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేడుకలలో యువకులు డ్యాన్సులు వేస్తూ రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ముందుకు సాగారు.



నల్లమాడలో వినాయకుడి శోభాయాత్ర



నల్లమాడలో ఆకట్టుకున్న కీలుగుర్రాల వేషధారణ



ముదిగుబ్బలో నిమజ్జనానికి..




తలుపులలో భక్తుల కోలాహలం నడుమ ఎగువపేట గణపతి ఊరేగింపు

నిర్లక్ష్యంతోనే వరద విపత్తు

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి





ధర్మవరం: విజయవాడలో ప్రకృతి విలయం కారణంగా నిర్వాసితులైన బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ధర్మవరం నియోజకవర్గ సమన్వయకర్త కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విజయవాడలో వరదలు ముంచెత్తాయన్నారు. వరదల విషయంలో ప్రజలను అప్రమత్తం చేయకుండా నిర్లక్ష్యం వహించడం వల్లనే ఈ పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. విజయవాడ చరిత్రలో ఎన్నడూ ఇంత నష్టం చూసిన దాఖలాలు లేవన్నారు. వరదల కారణంగా 1.50లక్షల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. ఇంకా 7లక్షల మంది వరద ముప్పుతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకు వెళ్లదీస్తున్నారన్నారు. రూ.10 వేల కోట్లదాకా నష్టం వాటిల్లిందన్నారు. తక్షణం వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. ప్రభుత్వం మాత్రం పబ్లిసిటీ స్టంట్‌గా మాత్రమే వరదసాయం అందిస్తోందని మండిపడ్డారు. వరదలు వచ్చి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ చాలాచోట్ల లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలు ఇళ్లలోనే చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం వారికి నీరు, ఆహారం కూడా సక్రమంగా అందే పరిస్థితిలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలకు సాయం అందించడంలో శ్రద్ధ చూపాలని కోరారు.

రెండో రోజూ వైద్య శిబిరం



బాధితులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

చెన్నేకొత్తపల్లి: ముష్టికోవెలలో రెండో రోజు బుధవారం కూడా వైద్య శిబిరం కొనసాగింది. సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా ఫుడ్‌పాయిజన్ అయిన విషయం తెలిసిందే. డీఎంఅండ్‌హెచ్ఓ మంజువాణి ఆదేశాలతో ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం నుంచి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఫుడ్ పాయిజన్ అయిన బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రాత్రి సమయంలో డాక్టర్లు అక్కడే ఉండి వచ్చిన వారికి వైద్యం చేశారు. రెండవ రోజు బుధవారం కూడా గ్రామంలో డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం కూడా వైద్య శిబిరం కొనసాగుతుందని డాక్టర్ తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించండి

బత్తలపల్లి/ తాడిమర్రి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు కోరారు. సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు చేపట్టిన సమ్మె 21వ రోజు బుధవారం కూడా బత్తలపల్లి, తాడిమర్రిలో కొనసాగింది. ఉద్యోగ భద్రతతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. బత్తలపల్లిలో ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జగన్ మారుతి, శంకరయ్య, బాషా, షేక్ మహబూబ్‌బాషా, ఓబులేసు, శంకరయ్య, అనంతయ్య, మురుగేష్, రామ్మోహన, జయరాము, సద్గురు, నరసింహులు, కేశవ, పద్గురు, రామ్మోహన్, సిద్దయ్య, అనంతయ్య, జయరాం, నరసింహులు, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు. తాడిమర్రి నిరసనలో కార్మిక సంఘం నాయకులు ఎం.సతీష్, కే.పెద్దఓబిలేసు, నాగార్జున, చిన్నఓబిలేసు, తిరుపాలు, లక్ష్మీనారాయణ, రాములప్ప తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం సాయం



బియ్యం వాహనాన్ని ప్రారంభిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్

ధర్మవరం అర్బన్: వరద బాధితుల సహాయార్థం 12 టన్నుల బియ్యాన్ని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్ ఆధ్వర్యంలో విజయవాడకు తరలించారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం రాత్రి వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ జెండా ఊపి బియ్యం వాహనాన్ని ప్రారంభించారు. దాతలు, ప్రజల ద్వారా నామాల గ్రామంతోపాటు ధర్మవరంలోని పలు వార్డుల ప్రజల సహకారంతో ఈ బియ్యాన్ని వరద బాధితులకు నేరుగా వెళ్లి ఇంటింటికీ అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, పట్టణాధ్యక్షుడు బండి వెంకటేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త మృతి



నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి

పుట్టపర్తి అర్బన్: చెర్లోపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళా కార్యకర్త నాగమ్మ (60) బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఓబుళంపల్లి గ్రామంలో గురువారం పుట్టపర్తి శ్రీసత్యసాయి బాబా మొబైల్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వైద్య పరీక్షలు చేయించుకునే వారు ఆధార్‌కార్డుతో పాటు సెల్‌ఫోన్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని ఓబుళంపల్లి శ్రీసత్యసాయి సేవాదళ్ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో సూచించారు.

రూ.41,116కు లడ్డూ వేలం



లడ్డూ దక్కించుకున్న వ్యక్తి

నల్లమాడ: మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలిలో వినాయకుడి పూజకు ఉంచిన 20 కిలోల లడ్డూను వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ ఆధ్వర్యంలో బుధవారం వేలం వేశారు. పొరకల క్రాంతికుమార్‌గౌడ్ రూ.41,116కు పాట పాడి లడ్డూ సొంతం చేసుకున్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ



కదిరి టౌన్: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను కదిరిలో బుధవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆదేశాల మేరకు బత్తల యువసేన సభ్యులు బాబ్జాన్, ముబారక్, ఇర్ఫాన్, చాంద్‌బాషా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో శారీరక, మానసిక ఎదుగుదల



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మీదేవి

తనకల్లు: మంచి పౌష్టికాహారంతోనే శిశువులో మానసిక, శారీరక ఎదుగుదల సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మల్లిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ అన్ని పోషక విలువలున్న సమతుల్య ఆహారం పిల్లలకు అందించగలిగితే వారిలో పౌష్టికాహార లోపాన్ని నివారించవచ్చన్నారు. గర్భిణిగా నమోదైనప్పటి నుంచి శిశువుకు ఆరు నెలల వయసు వరకు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఆరు నెలల నుంచి మూడేళ్లు నిండిన చిన్నారులకు బాలామృతం సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సత్యనారాయణ, కార్యకర్తలు భాగ్యమ్మ, శోభ, పద్మావతి, సుశీలమ్మ, సుజాత, స్వరూప, ఈశ్వరమ్మ, రెడ్డెమ్మ, సాయిలక్ష్మీ, అమరావతి, ఆదిలక్ష్మీ, ఆయాలు పాల్గొన్నారు.

మేలైన పద్ధతులతో అధిక దిగుబడులు



పొలం బడిలో మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

పుట్టపర్తి: మేలైన పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా తెలిపారు. బుక్కపట్నం మండలం గోశికవారిపల్లికి చెందిన రైతు రమణ పొలంలో బుధవారం 'పొలం బడి' నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ అతి తక్కువ ఎరువులు, పురుగు మందులు వాడి నాణ్యమైన అధిక నికర ఆదాయాన్ని పొందవచ్చన్నారు. రైతులు తప్పనిసరిగా సేంద్రియ ఎరువులు, జిప్సం, వేపనూనెను పంటలకు వాడాలని సూచించారు. అనంతరం రైతు నరసింహులు పొలంలో టమాట పంటను పరిశీలించి ఆకులకు వ్యాపించిన బ్యాక్టీరియా, మచ్చ తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ సతీష్‌బాబు, ఏఈఓలు సునీత, సుధాలక్ష్మి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర కీలకం



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ కీలక పాత్ర పోషించిందని రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఆమె 40వ వర్ధంతి సందర్భంగా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో ఐలమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివప్ప మాట్లాడుతూ తన ప్రాణాలను లెక్క చేయకుండా పెత్తందారులు, భూస్వాములు, రజాకార్లపై పోరాటం చేసి లక్షల ఎకరాలు బడుగు బలహీన వర్గాలకు భూ పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శ్రీనివాసులు, వెంకటేష్, పోచమ్మ, సాలమ్మ, నారాయప్ప, నాగమ్మ, శంకరప్ప, గంగిశెట్టి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కొరుగుట్టపల్లిలో బాధితుడిని పరామర్శిస్తున్న పూల శ్రీనివాసులురెడ్డి

తలుపుల : మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ కుళ్లాయప్ప అనారోగ్యంతో బాధపడుతున్నారు. అలాగే కొరుగుట్టపల్లిలో ఆర్మీ మాజీ ఉద్యోగి శ్రీనివాసులురెడ్డి భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి బుధవారం వారి ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల అగ్రి బోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు మల్లినాయుడు, మనోహర్‌నాయుడు, నాయకులు రోశిరెడ్డి, సుబ్బయ్య, గంగిరెడ్డి, హనుమంతరెడ్డి, యరమరెడ్డి, ఆశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం



మాట్లాడుతున్న మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

ధర్మవరం అర్బన్: ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పట్టణంలోని ప్రభుత్వ మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ పిలుపునిచ్చారు. మోడల్ కాలేజీలో బుధవారం ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజల్లో ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది.. రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన తర్వాత పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నివారణలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో శక్తి మైత్రి మహిళా సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్‌కుమార్, మైత్రి సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నరసింహులు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కర్రెప్ప గారి నరసింహులు (50) అనే వ్యక్తి మూడు రోజులుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు బుధవారం చెన్నేకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 9వ తేది ఉదయం టిఫిన్ తెచ్చుకునేందుకు బయటకు వెళ్లిన నరసింహులు మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. ఆచూకీ తెలిసిన వారు రామగిరి సీఐ 9440796835, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ 9440796836 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.